తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 19 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 106 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# 22-ఏ సమస్యల పరిష్కారానికి కమిటీ

- పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన
- ఫాస్ట్ ట్రాక్‌లో దరఖాస్తుల పరిష్కారం
- 118 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ ప్రారంభం
- ఎల్‌బీ నగర్‌లో 9,700 ప్లాట్లకు ఊరట

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

22ఏకు సంబంధించిన సమస్యలను ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవో ఆర్.టి. నంబర్ 564ను ప్రభుత్వం జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీకి ప్రధాన భూ పరిపాలన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. న్యాయ శాఖ కార్యదర్శి, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉండి 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలను పరిశీలించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం కమిటీ బాధ్యతగా ఉంటుంది. ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలో 118 జీవో ప్రకారం 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన మెమోను ప్రభుత్వం జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఇళ్ల నిర్మాణం చేసుకుని నివసిస్తున్న కుటుంబాలకు ఇది ఊరటనిచ్చే చర్యగా

మిగతా 2లో..



# కుల వివక్ష నిర్మూలనకు ఆలోచనా విధానం మారాలి

- 'పొలిటిక్స్ బియాండ్ క్యాస్ట్' సదస్సులో కల్వకుంట్ల కవిత
- బీసీ ఉపకులాలను కూడా జనగణనలో లెక్కించాలని డిమాండ్
- కులాల జనాభాను తక్కువ చేసి చూపే ప్రమాదం ఉందని ఆందోళన
- అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం అవసరం



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

కుల వివక్ష నిర్మూలన కోసం సమాజంలో ఆలోచనా విధానం మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" సదస్సులో పాల్గొన్న ఆమె కుల వివక్ష, సామాజిక సమానత్వం, కుల గణన వంటి అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. దేశంలో ఎంతటి ఉన్నత పదవుల్లో ఉన్నవారైనా కుల వివక్షను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని పేర్కొంటూ, కులం ఆధారంగా మనుషులను చూడడం ఇప్పటికీ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా మనిషిని మనిషిగా చూసే దృక్పథం పెరగాలని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఇంకా కుల వివక్షను ఎదుర్కొంటున్నారని కవిత పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కులం ఆధారంగా ఇళ్లు అద్దెకు ఇవ్వబోమని బోర్డులు పెట్టిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని, ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కావని అన్నారు. ఒక వ్యక్తితో కలిసి కూర్చుంటే, తాకితే ఏదో జరుగుతుందనే భావనలు ఇప్పటికీ కొనసాగడం బాధాకరమని పేర్కొన్నారు. కుల వివక్ష అనే సామాజిక రోగాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత స్పష్టతతో వ్యవహరించాలని కవిత కోరారు. కేవలం బీసీ అనే ఒకే విభాగాన్ని నమోదు చేయకుండా, బీసీల్లోని ఉపకులాలను కూడా ప్రత్యేకంగా లెక్కించాలని సూచించారు. దేశంలోని ఒకే కులానికి వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లు, వర్గీకరణలు ఉండటం

మిగతా 2లో..




# విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

- పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరు
- శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- పాల్గొన్న 750 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు
- యువ మేధస్సుకు ప్రోత్సాహమే లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్పొరేట్ సామాజిక బాధ్యత స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విద్య ద్వారా యువత భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. "యువ మేధస్సుకు ప్రోత్సాహం - ఉజ్వల భవిష్యత్తుకు బాట" అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఆర్థిక సహాయం అందించారు. విద్యాభ్యాసంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం ద్వారా ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం

మిగతా 2లో..



# ఫార్ములా-ఈ కేసుపై కేటీఆర్ ఫైర్

- నాంపల్లి ఏసీబీ కోర్టులో విచారణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- నవీన్ రెడ్డితో కలిసి కోర్టుకు హాజరు
- న్యాయస్థానంలోనే పోరాడతామని స్పష్టం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)**

ఫార్ములాఈ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కోర్టు పరిసరాల్లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, తమపై నమోదైన కేసులపై స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. తమపై నమోదు చేసిన కేసులు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమని కేటీఆర్ ఆరోపించారు. పచ్చి అబద్ధాలు, తప్పుడు ప్రచారాలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన తమ

మిగతా 2లో..



# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధుల వినియోగంపై దృష్టి

- బక్కి వెంకటయ్య అధికారులకు కీలక సూచనలు
- అట్రాసిటీ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి
- రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
- ప్రతి మండలంలో పౌర హక్కుల దినం నిర్వహణకు ఆదేశం

**గద్వాల జిల్లా, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)**

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు,

మిగతా 2లో..

# మిషన్ భగీరథకు నీటి సరఫరా వేగవంతం

- నార్లాపూర్ నుంచి పంపింగ్ పనుల పరిశీలన
- రూ.200 కోట్లతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు
- తాగునీటి కొరత నివారణకు చర్యలు
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
- మంత్రి జూపల్లి కృష్ణారావు

2లో



# సిద్దిపేట యాత్రపై హరీశ్‌రావు విమర్శలు

- ప్రజాధనం, ప్రభుత్వ సమయం వృథా చేశారని ఆరోపణ
- రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని సూచన
- రాజకీయ కక్షసాధింపులకు యాత్రలు వద్దన్న హరీశ్‌రావు

**సిద్దిపేట, సెప్టెంబర్ 18 తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు నిర్వహించిన పర్యటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎంపీల యాత్రల పేరుతో ఏదో యుద్ధానికి వస్తున్నట్లుగా సిద్దిపేటకు వచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. యాత్ర పేరుతో ప్రజాధనం, ప్రభుత్వ

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కుల వివక్ష నిర్మూలనకు ఆలోచనా విధానం మారాలి

(మొదటి పేజీ తరువాయి)

వల్ల ఉపకులాలను నమోదు చేయకపోతే అసలు జనాభా గణాంకాలు వక్రీకరించే ప్రమాదం ఉందని చెప్పారు. సరైన లెక్కలు లేకుంటే ప్రభుత్వ విధానాలు కూడా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. బీసీ ఉపకులాల వివరాలు నమోదు కాకపోతే వారి జనాభా వాస్తవానికి కంటే తక్కువగా కనిపించే అవకాశం ఉందని కవిత అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఉపకులాలకు ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బీసీల జనాభా గణనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, సరైన సమాచారం లేకపోతే సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలు ప్రభావితం అవుతాయని పేర్కొన్నారు. కులాల వారీగా ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని అన్నారు.

సమాజంలోని అన్ని వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు. ప్రతి కులాన్ని సాధికారత దిశగా నడిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజ్యాధికారంలో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చే చర్యలు కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. సరైన గణాంకాలు ఉంటేనే ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోగలవని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన విధంగానే కుల వివక్ష నిర్మూలన కోసం కూడా సమిష్టి ఉద్యమం అవసరమని కవిత పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రజలను ఏకం చేసినట్లే సామాజిక సమానత్వం కోసం కూడా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కుల గణన ప్రక్రియలో ఉపకులాల నమోదుకు ఇంకా సమయం ఉందని, కేంద్ర ప్రభుత్వం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కుల వివక్ష లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు.

# ఫార్ములా–ఈ కేసుపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఫార్ములాఈ రేసింగ్ పోటీలను హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి గుర్తింపు లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రపంచస్థాయి కార్యక్రమాలను వినియోగించుకుని పెట్టుబడులను ఆకర్షిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఆ అవకాశాలను వదులుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని అన్నారు. ఫార్ములాఈ రేసింగ్ ఈవెంట్‌ను రద్దు చేయడంతో రాష్ట్రానికి రావాల్సిన అవకాశాలు దూరమయ్యాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడమే కాకుండా, వాటికి సంబంధించిన అంశాలపై తమపైనే కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా లేవని విమర్శించారు.

తమపై వచ్చిన ఆరోపణలను చట్టపరంగా ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. న్యాయస్థానాల ముందు అన్ని విషయాలు వెల్లడిస్తామని, వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. కేసుల విషయంలో తమకు ఎలాంటి భయం లేదని, చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. దేశ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని కేటీఆర్ అన్నారు. రాజకీయ కుట్రలు, తప్పుడు ఆరోపణలను న్యాయస్థానంలోనే ఎదుర్కొంటామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ చట్టబద్ధ మార్గంలోనే ముందుకు సాగుతామని, ప్రభుత్వ విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధుల వినియోగంపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

సేవా అంశాలు, అట్రాసిటీ కేసులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద భారీగా నిధులు కేటాయించిందని, ఆయా వర్గాల కాలనీలు, వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు బీమా సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని సంబంధిత శాఖలకు సూచించారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరింత చర్యలు తీసుకోవాలని, విదేశీ విద్యా పథకాల అమలుకు అవసరమైన నిధుల సమీకరణపై ప్రభుత్వంతో చర్చిస్తానని బక్కి వెంకటయ్య తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం అర్హులైన విద్యార్థులకు ఉచిత విద్య అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రేపల్లె ఘటనల వంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషన్ చైర్మన్ సూచించారు. బాధిత కుటుంబానికి గృహం, ఉపాధి, వ్యవసాయ భూమి వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి సహాయం అందించే దిశగా కృషి చేస్తానన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు సామరస్యంగా జీవించేలా ప్రతి నెల అన్ని మండలాల్లో పౌర హక్కుల దినం నిర్వహించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయిస్తున్న సంక్షేమ నిధులను వంద శాతం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విచారణను డీఎస్పీ స్థాయి అధికారులతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం రేపల్లె ఘటన బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారంలో తొలి విడతగా రూ.25 వేల చెక్కును కమిషన్ చైర్మన్, కలెక్టర్ తదితరులు అందజేశారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, గంధం నాగరాజు, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథకు నీటి సరఫరా వేగవంతం

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు జలాశయాలకు నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథకు నీటిని తరలించేందుకు రూ.200 కోట్ల వ్యయంతో చేపడుతున్న పంపింగ్ వ్యవస్థ పనులను మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రధాన కాలువ పరిధిలోని సున్నపుతాండ సమీప ప్రాంతంలో మిషన్ భగీరథకు నీటిని సరఫరా చేయడానికి ప్రత్యేక పంపింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వ్యవస్థ ద్వారా అవసరమైన సమయంలో తాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ప్రాజెక్టు పూర్తయితే పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశముందని అధికారులు వివరించారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా నదుల్లో నీటి ప్రవాహం తగ్గిపోవడంతో జలాశయాల నీటి నిల్వలపై ఒత్తిడి పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. కేఎల్ఐ ప్రాజెక్టుతో పాటు పాలమూరు-రంగారెడ్డి రిజర్వాయర్ నీటిని కూడా మిషన్ భగీరథ అవసరాలకు వినియోగించేలా చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. పరిశీలన సందర్భంగా పంపింగ్ స్టేషన్లు, పైపులైన్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు, నీటి తరలింపు సామర్థ్యంపై అధికారులు మంత్రికి వివరాలు అందించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించాలని జూపల్లి కృష్ణారావు అన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నీటి నిర్వహణలో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం పలు జిల్లాల్లో తాగునీటి సరఫరా మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు నీటి కొరత లేకుండా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# పోలీసు శాఖ బలోపేతానికి కీలక నిర్ణయాలు

- **డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష సమావేశం**
- **సిబ్బంది, వనరుల పునర్వ్యవస్థీకరణపై చర్చ**
- **ఫిట్‌కాప్ అమలుకు ప్రాధాన్యం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** తెలంగాణ పోలీసు శాఖలో పరిపాలనా, కార్యాచరణ పరమైన అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తూ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సీనియర్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి నెల సీనియర్ అధికారులతో సమావేశాలు నిర్వహించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ జరిగిన ఈ సమావేశంలో గత కొన్ని నెలలుగా చేపట్టిన విధానపరమైన నిర్ణయాలు, శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. మానవ వనరులు, వాహనాలు మరియు ఇతర వనరుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా చేయడంపై సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. మావోయిస్టు ప్రభావం తగ్గిన నేపథ్యంలో భద్రతా విధుల్లో అదనంగా ఉన్న సిబ్బందిని ఇతర అవసరమైన విభాగాలకు తరలించడం ద్వారా 376 మంది సిబ్బంది, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఫార్చ్యూనర్, ఇన్నోవా వాహనాలతో పాటు ఇతర వాహనాలను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఈ వనరులను అవసరమైన విభాగాలకు కేటాయించడం ద్వారా శాఖ సామర్థ్యం పెరిగిందని అధికారులు తెలిపారు.

గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 573 మంది సిబ్బందిని ఇతర కీలక విభాగాలకు కేటాయించిన విషయాన్ని సమావేశంలో సమీక్షించారు. అవినీతి నిరోధక శాఖ, నేర పరిశోధన విభాగం, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ భద్రత, విజిలెన్స్, పౌర సరఫరాలు, రోడ్డు భద్రత వంటి విభాగాల్లో సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి గణనీయమైన ఆర్థిక ఆదా కూడా లభిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖలో ఆమోదిత సిబ్బంది సంఖ్యను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడంపై కూడా చర్చించారు.



కొత్తగా ఏర్పడుతున్న విభాగాలు, ఆధునిక నేరాల నియంత్రణకు అవసరమైన ప్రత్యేక యూనిట్లలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. వచ్చే నెలలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సదస్సు ఏర్పాట్లను కూడా సమావేశంలో సమీక్షించారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యం, శారీరక దృఢత్వం మెరుగుపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 'ఫిట్‌కాప్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. గత ఏడాది నిర్వహించిన పోలీసు రిట్రీట్‌లో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని పరిశీలించడంతో పాటు ఈ ఏడాది నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణపై కూడా చర్చించారు. అలాగే వివిధ బ్యాచ్‌లకు చెందిన అధికారుల పదోన్నతుల అంశం కూడా సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. కొత్త తెలంగాణ పోలీసు మాన్యువల్ రూపకల్పన, ఉన్నత స్థాయి ఐపీఎస్ అధికారుల ఖాళీలు, కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ప్రజా అనుసంధాన కార్యక్రమాలు, శాఖకు సంబంధించిన బడ్జెట్ మరియు పరిపాలనా అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. ఇటువంటి సమావేశాలు సీనియర్ అధికారుల అభిప్రాయాలను సమన్వయం చేసుకుని ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడతాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# 22ఏ సమస్యల పరిష్కారానికి కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. 118 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అర్హులైన ప్లాటు యజమానులు స్థానిక అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం తమ ఆస్తులను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

సింగరేణి ప్రాంతాల్లో ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని మంత్రి తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రారంభించనున్నట్లు చెప్పారు. గతంలో జారీ చేసిన సంబంధిత జీవోలను అనుసరించి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ హెచ్ఎండీఏ, డీటీసీపీ, జీహెచ్ఎంసీ అనుమతులతో అభివృద్ధి చెందిన లేఅవుట్లను 22ఏ నుంచి తొలగించే అంశంపై కూడా త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించిన అంశాలపై నెలరోజుల వ్యవధిలో నిర్ణయాలు తీసుకుని దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

# విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమారు 750 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, సంరక్షకులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యా రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం అవసరమని వక్తలు పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి ప్రధాన శక్తి అని అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డా. జి. ముకుంద్ రెడ్డి, రక్షిత కె. కృష్ణమూర్తి, కుమార్ మొలుగారం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. విద్యా రంగంలో నాణ్యత, ప్రోత్సాహం, అవకాశాల విస్తరణపై వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన సాధనమని పేర్కొన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుదర్శన్ హోల్లా బాల్నాడ్ సంస్థ చేపడుతున్న సామాజిక బాధ్యత కార్యక్రమాల గురించి వివరించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా సమాజానికి మెరుగైన భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. స్కాలర్‌షిప్‌ల ద్వారా మరింత మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సిద్దిపేట యాత్రపై హరీశ్‌రావు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

సమయం ఎంత మేర వృథా అయిందో ప్రజలే ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వాలు వాస్తవాలను దాచిపెట్టిన సందర్భాల్లో ప్రతిపక్షాలు నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయికి వెళ్లడం సహజమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే అధికారంలో ఉన్న ప్రభుత్వ ప్రతినిధులే యాత్రలు నిర్వహించడం విచారకరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం చేతిలో ఉన్నప్పుడు ప్రత్యేక యాత్రల అవసరం ఏమిటని ప్రశ్నించారు.

ప్రభుత్వానికి అన్ని శాఖలు, అధికారులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో అవసరమైన నివేదికలను సులభంగా తెప్పించుకోవచ్చని ఆయన అన్నారు. అధికార పక్ష నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి ఆరోపణలు చేయడం కంటే అధికారిక సమాచారం ఆధారంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరి కాదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి అంశాలపై అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని హరీశ్‌రావు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల కోసం ఎంపీలు సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశయాల సాధనలో ప్రజాప్రతినిధుల పాత్ర మరింత బాధ్యతాయుతంగా ఉండాలని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వాటిని కక్షసాధింపు రాజకీయాల స్థాయికి తీసుకెళ్లకూడదని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాల్సిన సమయంలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయడం మంచిది కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. సిద్దిపేట పర్యటన సందర్భంగా వెలువడిన పరిణామాలపై స్పందిస్తూ హరీశ్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని వర్గాలు కలిసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ప్రత్యేక ఎన్ఆర్ఐ కమిషన్‌కు వినతి

- **అద్దంకి దయాకర్, ఝాన్సీ రెడ్డి ప్రతిపాదన**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం**
- **విదేశీ తెలంగాణ వాసుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** తెలంగాణకు చెందిన విదేశీ భారతీయుల సమస్యల పరిష్కారం, వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం రాష్ట్రంలో ప్రత్యేక ఎన్ఆర్ఐ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ మరియు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులకు ఒకే వేదికపై సేవలు అందించే వ్యవస్థ అవసరమని వారు అభిప్రాయపడ్డారు. అమెరికా, గల్ఫ్ దేశాలు, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులు రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, వైద్య సేవలు, దాతృత్వ కార్యక్రమాల ద్వారా విశేష సహకారం అందిస్తున్నారని వారు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆస్తి వివాదాలు, భూ సమస్యలు, పత్రాల ధృవీకరణ, కుటుంబ అత్యవసర పరిస్థితులు, చట్టపరమైన ఇబ్బందుల సమయంలో సమన్వయ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ఎన్ఆర్ఐ కమిషన్ ప్రభుత్వం మరియు విదేశీ తెలంగాణ వాసుల మధ్య అనుసంధాన వేదికగా పనిచేస్తుందని వివరించారు. ఫిర్యాదుల పరిష్కారం, భూములు మరియు ఆస్తులకు సంబంధించిన వివాదాల పరిష్కారం, మోసపూరిత లావాదేవీల నుంచి రక్షణ, చట్టపరమైన సలహాలు అందించడం వంటి అంశాలు కమిషన్ ప్రధాన బాధ్యతలుగా ఉండాలని సూచించారు.

## ఆయిల్‌పామ్ రైతులకు ధర భరోసా కల్పించాలి

- ఎఫ్ఎఫ్‌బీకి టన్నుకు రూ.25 వేల హామీ ధర కోరిన రైతుల సంఘం .
- కేంద్ర మంత్రికి వినతి.



**అశ్వారావుపేట, సెప్టెంబరు 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పంటపై భరోసా పెంచాలని తెలంగాణ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఆయిల్‌పామ్ తాజా పండ్ల గెలలు (ఎఫ్ఎఫ్‌బీ) టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధరను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు అలపాటి రామచంద్ర ప్రసాద్ శుక్రవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ప్రతిని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సైతం అందజేశారు. దేశాన్ని తినదగిన నూనెల ఉత్పత్తిలో ఆత్మనిర్భర్‌గా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్‌పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ)'ను అమలు చేస్తోందని రామచంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడం, ముడి పామాయిల్ ఉత్పత్తిని పెంచడం, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం పథకం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ రంగ సంస్థ టీజీ ఆయిల్‌ఫెడ్ అధిక నూనె దిగుబడిని సాధిస్తూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకంగా నిలుస్తోందన్నారు. టీజీ ఆయిల్‌ఫెడ్ సాధిస్తున్న నూనె వెలికితీత రేటును ప్రామాణికంగా తీసుకుని రైతులకు ఎఫ్ఎఫ్‌బీ ధరలు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్ఎంఈఓ-ఓపీ కింద ఐదేళ్లలో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ తోటల విస్తరణకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. పంటపై రైతుల్లో ఆసక్తి పెరుగుతున్నా.. ఎఫ్ఎఫ్‌బీ ధరల్లో హెచ్చుతగ్గులు సాగు వ్యయానికి చేరువవుతుండటంతో కొత్తగా తోటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఎరువులు, కూలీలు, రవాణా ఖర్చులు గణనీయంగా పెరగడంతో ఆయిల్‌పామ్ సాగు వ్యయం అధికమైందన్నారు. ఎఫ్ఎఫ్‌బీ ధరలు తగ్గిన సందర్భాల్లో ఇప్పటికే సాగు చేస్తున్న రైతులు సైతం నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులకు చెల్లించే ఎఫ్ఎఫ్‌బీ ధర నెలవారీ సగటు ముడి పామాయిల్ ధర ఆధారంగా నిర్ణయిస్తారని పేర్కొన్నారు. రైతులకు పంట లాభదాయకంగా ఉండాలంటే ముడి పామాయిల్ ధర టన్నుకు సుమారు రూ.1.40 లక్షల స్థాయిలో ఉండేలా చర్యలు అవసరమన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించడంతోపాటు రైతుల్లో పంటపై నమ్మకాన్ని పెంచేందుకు ఎఫ్ఎఫ్‌బీకి టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధరను అమలు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

## ఉచిత పథకాలు వద్దు.. ఉచిత విద్య, వైద్యమే ముద్దు



- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో తమ్మినేని వీరభద్రం

**జనగామ, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో పలువురు సీపీఎం పార్టీలో చేరారు. చిల్పూర్ మండలంలోని లింగంపల్లి, కొండాపూర్ గ్రామాలకు చెందిన ఎనిమిది కుటుంబాల ప్రతినిధులు పార్టీలో చేరారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచిత పథకాల పేరుతో తాత్కాలిక ప్రయోజనాలు కల్పించడం కంటే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే నిజమైన సంక్షేమమని అన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పేదలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందని విమర్శించారు.

పార్టీలో చేరిన వారిలో అపరాధపు రవి కుమార్, నాగవెల్లి సాయి, బానోత్ రాజేందర్, పెండ్లి రాజు, కర్రె సంపత్, కండ్లకోలు ప్రవీణ్ కుమార్ (లింగంపల్లి), గుండబోయిన సదానంద్, గుండబోయిన రాజు (కొండాపూర్) ఉన్నారు. కార్యక్రమంలో చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ముచ్చట్లు వార్తకు స్పందన.. కదిలిన అధికార యంత్రాంగం!

- కృష్ణాజిగూడెం వార్డుల్లో మురుగునీటి సమస్యపై ఎంపీడీఓ సీరియస్
- ఫాగింగ్, బ్లీచింగ్‌కు ఆదేశాలు.. డ్రైనేజీలకు అడ్డుకట్ట వేసేవారికి నోటీసులు



**చిల్పూర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని కృష్ణాజిగూడెం గ్రామంలోని 3, 4వ వార్డుల్లో మురుగునీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ తెలంగాణ ముచ్చట్లులో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. వార్తపై స్పందించిన చిల్పూర్ ఇన్‌చార్జి ఎంపీడీఓ కిరణ్ ప్రసాద్, సర్పంచ్ మల్లం రవీందర్‌తో కలిసి శుక్రవారం కృష్ణాజిగూడెం గ్రామంలోని ఆయా కాలనీల్లో పర్యటించారు. మురుగునీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. సమస్యలపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కాలనీల్లో వెంటనే పొగమందు పిచికారీ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ పొడి చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. నిలిచిపోయిన మురుగునీటిని తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే డ్రైనేజీ కాలువలకు అడ్డుకట్టలు వేసిన వారిని, ఇళ్ల నిర్మాణ వ్యర్థాలతో కాలువలను పూడ్చిన వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కాలనీలో అవసరమైన విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. అధికార యంత్రాంగం స్పందించి కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన తెలంగాణ ముచ్చట్లు పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి జేస్మని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వాణిశ్రీ



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వాణిశ్రీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, ప్రయోగశాల నమోదు పుస్తకాలు, మందుల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. జ్వరంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి తప్పనిసరిగా ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు వైద్య సేవలు అందించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య సేవలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో వైద్యాధికారి డా. శ్రీవాణి, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి డా. అజయ్ కుమార్, సామాజిక ఆరోగ్య అధికారి జయపాల్ రెడ్డి, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు రాజేష్, ఔషధ విక్రేత, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- వెల్టూర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**పెద్దమందడి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి శుక్రవారం పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. పాఠశాల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, స్థల విస్తీర్ణం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం సంతోషకరమని, ఈ పాఠశాలను వెల్టూర్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వంతో విద్యార్థులు విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధనతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో వెల్టూర్‌తో పాటు పరిసర గ్రామాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల విధానం ప్రపంచానికే ఆదర్శం

- ధర్మసాగర్ కేజీబీవీని సందర్శించిన తుర్కియే దేశ ప్రతినిధులు





**ధర్మసాగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత విద్యారంగాన్ని పరిశీలించేందుకు వచ్చిన తుర్కియే దేశ ప్రతినిధులు మసూద్ ఓనర్, నూరుల్లా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, కంప్యూటర్ ప్రయోగశాల, విజ్ఞాన ప్రయోగశాల, గ్రంథాలయాలను పరిశీలించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానం, బోధనా పద్ధతులు, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సీనియర్ ఇంటర్ విద్యార్థినులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల ప్రత్యేక అధికారి మాధవితో ప్రతినిధులు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

తెలంగాణలో అమలు చేస్తున్న నివాస విద్యా విధానం పట్ల తుర్కియే దేశ ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు వసతి, భోజనం, ఇతర సౌకర్యాలను అందిస్తూ సమగ్ర విద్యను అందిస్తున్న విధానం తమను ఆకట్టుకుందని తెలిపారు. ఇలాంటి నివాస విద్యా విధానాన్ని తమ దేశంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, జిల్లా బాలికా విద్యాధికారి సునీత, మండల విద్యాధికారి శ్రీదేవి తెలంగాణలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలను ప్రతినిధులకు వివరించారు.

అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠశాల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, అభ్యాస పుస్తకాలు, నోటు పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు అశ్వినీ కుమార్, ప్రధాన కార్యదర్శి సి.ఎల్. రోజ్, కార్యనిర్వహణ అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రతినిధులు చిత్తలూరి ప్రసాద్, త్రివేణి, విజయలక్ష్మి, గీత, పాలిటెక్నిక్ అధ్యాపకురాలు రజితా రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షం గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఫలిత శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల ఉపేందర్ రెడ్డి, మహబూబాబాద్ అధ్యక్షుడు మిర్యాల సతీష్, ధర్మసాగర్ మండల శాఖ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి జాన్ సింగ్, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కరీంనగర్ రూపురేఖలు మారాయి

- ప్రధాని మోదీ ఆశీస్సులు, బండి సంజయ్ చొరవతో నగరానికి భారీగా నిధులు: యాదగిరి సునీల్‌రావు

**కరీంనగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు ):** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కరీంనగర్ నగర రూపురేఖలు మారుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో నగరానికి వివిధ పథకాల ద్వారా భారీగా నిధులు వస్తున్నాయని తెలిపారు.

స్మార్ట్ సిటీ, అమృత్, యూఐడీఎఫ్, యూసీఎఫ్‌తో పాటు రైల్వేస్టేషన్ ఆధునీకరణ, ఆర్ఓబీ, సీఆర్ఎఫ్ తదితర పథకాల ద్వారా నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో 46 పనులకు గాను సుమారు 40 పనులు పూర్తయ్యాయని, మరో ఆరు పనులు తుది దశలో ఉన్నాయని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా నగరాభివృద్ధికి రూ.934 కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. అమృత్ పథకం కింద కరీంనగర్ తాగునీటి అవసరాల కోసం రూ.132 కోట్ల నిధులు తీసుకొచ్చామని, వీటితో కొత్త ట్యాంకులు, పైప్‌లైన్లు, ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కరీంనగర్-హన్మకొండ జాతీయ రహదారి పనులు రెండున్నరేళ్లలో పూర్తయ్యాయని, జగిత్యాల-కరీంనగర్ రహదారికి కూడా అనుమతులు లభించాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

యూసీఎఫ్ ప్రాజెక్టులో కరీంనగర్‌ను చేర్చి రూ.840 కోట్ల నిధులు తీసుకురావడంలో బండి సంజయ్‌కుమార్ కీలక పాత్ర పోషించారని సునీల్‌రావు పేర్కొన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంపై బండి సంజయ్‌ను విమర్శిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నగర అభివృద్ధికి తాము తీసుకొచ్చిన నిధుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని సవాల్ విసిరారు.


ప్రజలు బీజేపీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.



ఈ సమావేశంలో కార్పొరేటర్లు సోమిడి వేణు, పొన్నం లక్ష్మిమొండయ్య, నాంపల్లి రేణుకశ్రీనివాస్, కర్రె పద్మఅనిల్, కోఆప్షన్ సభ్యులు సర్దార్ బల్వీర్ సింగ్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండి ప్రశాంత్ దీపక్, బీజేపీ నాయకులు కటకం లోకేష్ కుమార్, టి.చంద్రమౌళి, పండుగ నాగరాజు, వాసు, సత్యనారాయణ రెడ్డి, కుంభం అనిల్ కుమార్, హమీద్, దాసరి రమేష్, ఐలేని రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వెల్టూర్ స్టేజి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి



- ఎమ్మెల్యే మేఘా రెడ్డికి గ్రామ యువకుల వినతి

**పెద్దమందడి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజి వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వెల్టూర్ గ్రామానికి చెందిన యువకులు పాముల నాగార్జున ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేఘారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించడంతో రెండు మూడు రోజుల పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు వెల్టూర్ స్టేజి వద్ద ఆగాయని, అనంతరం మళ్లీ బస్సులు నిలపడం లేదని యువకులు తెలిపారు. వెల్టూర్ స్టేజి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకపోవడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎక్స్‌ప్రెస్ బస్సుల సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. యువకుల వినతిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి వెంటనే స్పందించి వనపర్తి ఆర్టీసీ ప్రాంతీయ రవాణా అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెల్టూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు పది వేల మంది జనాభా ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెల్టూర్ స్టేజి వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను తప్పనిసరిగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంకు సూచించారు. వనపర్తి-గద్వాల మార్గంలో నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతానికి రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ బస్సులను కూడా వెల్టూర్ స్టేజి వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్ఎంకు సూచించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలకు సూచించడంపై వెల్టూర్ గ్రామ యువకులు పాముల నాగార్జున హర్షం వ్యక్తం చేశారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**చిల్పూర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన ప్రముఖ పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం చిల్పూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ రాజారపు రంజిత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో వృద్ధులు, మహిళలతో పాటు 100 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో కంటి శస్త్రచికిత్స అవసరమైన అర్హులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందజేస్తామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గతంలో కూడా చిల్పూర్ గ్రామంలో 180 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాజారపు రంజిత్ మాట్లాడుతూ పేద ప్రజలకు కంటి చూపును మెరుగుపరిచేందుకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న పుష్పగిరి కంటి ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప వార్డు సభ్యుడు మహ్మద్ షకీల్, దేవస్థానం డైరెక్టర్ గణగోని రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల కృష్ణకు ఘన సన్మానం



**వనపర్తి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ కోర్ కమిటీ సభ్యుడిగా నియమితులైన గద్వాల కృష్ణను వనపర్తి జిల్లా ఎస్టీ, ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం గద్వాల కృష్ణ చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతకుంట విద్యాబాబు, బోజి రాజు, గద్వాల వెంకటేష్, యాదవల్లి వీరప్ప, రామచంద్రయ్య, డి. వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ.. గద్వాల కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, వేతనాలు, పేదలకు పింఛన్ల వంటి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం గద్వాల కృష్ణ మాట్లాడుతూ.. తనను సన్మానించి అభినందించిన జిల్లా ఎస్టీ, ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బాధితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు.

# వాయిదా పడిన పరీక్షలకు వెంటనే కొత్త షెడ్యూల్ ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన గట్టు మన్నెం



**వనపర్తి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వాయిదా పడిన మధ్యంతర పరీక్షలకు వెంటనే కొత్త షెడ్యూల్ విడుదల చేసి, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని పాలిటెక్నిక్ విద్యార్థుల సంక్షేమ తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు, మోజెర్ల మాజీ సర్పంచ్ గట్టు మన్నెం కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గట్టు మన్నెం మాట్లాడుతూ.. సెప్టెంబర్ 18 నుంచి 21 వరకు జరగాల్సిన మధ్యంతర పరీక్షలు కొందరి నిరసనలు, పరీక్షల బహిష్కరణకు పిలుపు నేపథ్యంలో వాయిదా పడ్డాయని తెలిపారు. పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని కోరారు. పరీక్షలను బహిష్కరించాలనుకునే విద్యార్థులు తమ నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను కలిగి ఉండాలని, అయితే ఇతర విద్యార్థులను అడ్డుకోవడం, బెదిరించడం, బలవంతం చేయడం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.97పై విద్యార్థులకు ఉన్న అభ్యంతరాలను సంబంధిత ఉన్నత స్థాయి కమిటీ దృష్టికి శాంతియుతంగా తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా వాయిదా పడిన పరీక్షలకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి, పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం అందించాలని గట్టు మన్నెం విజ్ఞప్తి చేశారు.

# పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి

- స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్




**పెద్దమందడి,సెప్టెంబరు18(తెలంగాణ ముచ్చట్లు):** స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ర్యాలీ చేపట్టి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇళ్లలో నిత్యావసరంగా వినియోగించే కూరగాయల వ్యర్థాలు, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్తబుట్టల్లో వేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. బహిరంగంగా మలమూత్ర విసర్జన చేయకుండా ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. త్వరలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి నాలుగు చెత్తబుట్టలను అందజేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా సమన్వయకర్త రమేష్, క్షేత్ర సహాయకులు, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్, పాఠశాల సిబ్బంది, జానయ్య, రాములు, గ్రామ పెద్దలు రాములు, వెంకటయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం.!

- రైతు భరోసా, రుణమాఫీతో అన్నదాతకు అండ.
- ఆయిల్‌పామ్‌కు కనీస ధర కల్పించాలి.
- కేంద్రం సహకారం అవసరం.. ఎల్‌నినో పరిస్థితులపై ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి.
- మంత్రి తుమ్మల.



**సత్తుపల్లి, సెప్టెంబరు 18 (తెలంగాణ ముచ్చట్లు):** రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర, సాగుకు సాంకేతిక సహకారం, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శుక్రవారం హైదరాబాద్ హైటెక్‌సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన సదరన్ జోనల్ అగ్రికల్చర్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద ఎకరాకు ఏటా రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.35,839 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. వానాకాలం2026లో కేవలం తొమ్మిది రోజుల్లో 70.40 లక్షల మంది పట్టాదారులకు రూ.8,759 కోట్లను నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. రైతు రుణమాఫీ కింద ఒక్కో రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి, దాదాపు 25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పించామని, ఇందుకోసం సుమారు రూ.21 వేల కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. రైతు బీమా ద్వారా గత మూడేళ్లలో రూ.3,531 కోట్ల ప్రీమియం చెల్లించి 42 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు భద్రత కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతున్నామని, 'రైతు నేస్తం' ద్వారా నిపుణుల సలహాలు అందిస్తున్నామని చెప్పారు. యూరియా యాప్ ద్వారా ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సమర్థంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని తుమ్మల తెలిపారు. దాదాపు లక్ష హెక్టార్లను అదనంగా ఆయిల్‌పామ్ సాగులోకి తీసుకురాగా, 72 వేల మంది రైతులు ఇందులో భాగస్వాములయ్యారని చెప్పారు. అయితే ఉత్పత్తి పెరగడంతో పాటు రైతుకు ధర భరోసా ఉండటం అత్యంత ముఖ్యమన్నారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని పునఃపరిశీలించాలని, తాజా ఆయిల్‌పామ్ గెలలకు (ఎఫ్ఎఫ్‌బీ) టన్నుకు రూ.25 వేల కనీస గ్యారంటీ ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే మార్కెట్ ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా కొనుగోళ్లు చేపడుతోందని మంత్రి చెప్పారు. మొక్కజొన్నకు సుమారు రూ.6 వేల కోట్లు, జొన్నకు రూ.1,100 కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎంఎస్‌పీ అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్ కింద నాఫెడ్ వంటి కేంద్ర సంస్థల ద్వారా సమర్థంగా కొనుగోలు చేయాలని సూచించారు. మార్కెట్ ధరలు ఎంఎస్‌పీ కంటే దిగువకు వచ్చినప్పుడు ప్రస్తుతం ఉన్న 25 శాతం పీఎస్ఎస్ పరిమితిని సడలించాలని లేదా తొలగించాలని కోరారు. రాష్ట్రాలు అదనంగా చేపట్టే కొనుగోళ్ల వ్యయంలో కేంద్రం కూడా భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు.

వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించాలని తుమ్మల కోరారు. ఎల్‌నినో ప్రభావం, అనిశ్చిత వర్షాలు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఎల్‌నినో అసిస్టెన్స్ ఫండ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సూక్ష్మ సాగునీటి పద్ధతులు, నీటి పొదుపు చర్యలకు కేంద్రం మరింత ఆర్థిక సహకారం అందించాలని కోరారు. రైతుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే వ్యవసాయ రంగం మరింత బలోపేతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.

# భారతీయులను ఏకం చేసిన పండుగ వినాయక చవితి

- పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):-** భారతీయులను ఐక్యంగా నిలిపిన పండుగ వినాయక చవితి అని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వనపర్తి పట్టణంలోని మణికంఠ కాలనీలో వినాయక చవితి సందర్భంగా కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బాల గంగాధర్ తిలక్ వినాయక మండపాలను ప్రజా వేదికలుగా మలిచి జాతీయ భావాన్ని ప్రజల్లో పెంపొందించారని గుర్తుచేశారు. విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులతో అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప పుణ్యం లేదని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ ఒకే చోట కలిసి ప్రసాదాన్ని స్వీకరించడం భారతీయుల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. అన్నదానం నిర్వహించిన వారికి అన్నదాత సుఖీభవ అని ఆశీర్వాదాలు ఉంటాయని, అన్నం పెట్టిన వారి ఇంట లక్ష్మీదేవి కొలువుంటుందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశీ రాములు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మద్దిలేటి, ఆంజనేయులు, రాఘవేంద్ర, శివకుమార్, జగదీశ్వర్‌రెడ్డి, గోపాల్, కేశవులు, బీసీ రెడ్డి, నాగరాజ్, మైత్రి, శైలజ, నరేష్, రమేష్, రాజేంద్ర ప్రసాద్ చారి, స్వప్న, హేమలత, పుష్పలత, కళ్యాణి తదితరులతో పాటు స్థానిక భక్తులు, కాలనీ వాసులు, సాహితీ కళా వేదిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో వినాయక మండపాలను సందర్శించిన బండి సంజయ్

- గణనాథుడికి ప్రత్యేక పూజలు
- ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్ష

**కరీంనగర్, సెప్టెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు ):** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ నగరంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, దేశం, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని బండి సంజయ్ ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని భక్తులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు బీజేపీ స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## వెల్టూర్ అభివృద్ధిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక శ్రద్ధ అభినందనీయం



- **ప్రేమసాగర్, వడ్డే శేఖర్, దిండు రవీందర్ కాంగ్రెస్ నాయకులు**

**పెద్దమందడి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన కోసం వచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమసాగర్, కాంగ్రెస్ నాయకులు వడ్డే శేఖర్, దిండు రవీందర్ అభినందనలు తెలిపారు. వెల్టూర్‌లో పాఠశాల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే స్వయంగా స్థల పరిశీలనకు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమసాగర్ మాట్లాడుతూ.. వెల్టూర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలనే ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవ అభినందనీయమన్నారు. స్థానిక విద్యార్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు కూడా ఈ పాఠశాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు వడ్డే శేఖర్ మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వెల్టూర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పెద్దమందడి ఖిల్లా ఘనపూర్ మండలాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాయకుడు దిండు రవీందర్ మాట్లాడుతూ..వెల్టూర్‌లో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కావడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేపట్టిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.వెల్టూర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు పూర్తయితే స్థానిక విద్యార్థులతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

## గృహిణి మెడలో పుస్తెలతాడు చోరీ


- **హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు.. హన్మకొండ వైపు పరారీ**



**హుజురాబాద్, సెప్టెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఓ గృహిణి మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. పరకాల క్రాస్ రోడ్ వద్ద హోటల్ నిర్వహిస్తున్న గోస్కుల సక్కమ్మ వద్దకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చారు. హెల్మెట్లు ధరించిన వారు హోటల్ వద్దకు చేరుకుని, ఒక్కసారిగా సక్కమ్మ మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని బైక్‌పై హన్మకొండ వైపు వేగంగా వెళ్లిపోయారు. అకస్మాత్తుగా జరిగిన ఘటనతో సక్కమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే దుండగులు బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై వివరాలు సేకరించి, నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.పట్టపగలే హోటల్ వద్ద ఈ విధంగా చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## మిశ్రమంగా ముగిసిన మార్కెట్లు

**ముంబై, సెప్టెంబరు 18 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదిలిన సూచీలు చివరకు భిన్న ఫలితాలతో స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 19.63 పాయింట్లు నష్టపోయి 74,294.96 వద్ద ముగియగా.. నిఫ్టీ 75.80 పాయింట్లు లాభపడి 23,346.40 వద్ద స్థిరపడింది.
నిఫ్టీ 23,300 స్థాయికి పైన ముగియడం కీలక పరిణామమని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఈ స్థాయిని కొనసాగిస్తే తదుపరి రోజుల్లో 23,500-23,600 స్థాయిలను చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. 23,200, 23,000 స్థాయిలను కీలక మద్దతు స్థాయిలుగా పేర్కొన్నారు. ఎంచుకున్న భారీ షేర్లలో కొనుగోళ్లకు ఆసక్తి కనిపించింది. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, భారతీ ఎయిర్‌టెల్ లాభాల్లో ముందంజలో నిలిచాయి. విస్తృత మార్కెట్ మాత్రం ప్రధాన సూచీల కంటే మెరుగ్గా రాణించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 1.24 శాతం, స్మాల్‌క్యాప్ 1.74 శాతం చొప్పున పెరిగాయి. మెటల్, రియల్టీ, చమురు-వాయువు, సిమెంట్, రసాయన రంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. మరోవైపు ఐటీ సూచీ అత్యధికంగా నష్టపోయింది. ముడిచమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయ బాండ్ రాబడుల్లో మార్పులు మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత మద్దతు ఇచ్చాయని నిపుణులు తెలిపారు. భౌగోళిక ఉద్రిక్తతలపై ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ.. ప్రధాన కేంద్ర బ్యాంకుల విధాన నిర్ణయాలపై ఉన్న అంచనాలు కూడా మదుపరుల సెంటిమెంట్‌కు కొంత ఊతమిచ్చాయని వారు పేర్కొన్నారు.



# ప్రజారోగ్యంపై వైద్యశాఖ ప్రత్యేక దృష్టి

- **జమ్మికుంటలో పేషంట్ సేఫ్టీ డేపై అవగాహన..**
- **వడ్డెర కాలనీలో డ్రై డే కార్యక్రమం**






**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య చికిత్సలో చోటుచేసుకునే పొరపాట్లను నివారించడమే పేషంట్ సేఫ్టీ డే ముఖ్య ఉద్దేశమని హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చందన ఆధ్వర్యంలో పేషంట్ సేఫ్టీ డేపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ.. గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పొందుతున్న రోగులకు సురక్షితమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య చికిత్స, మందుల వినియోగం, వ్యాధి నిర్ధారణలో జరిగే పొరపాట్లను సాధ్యమైనంత వరకు తగ్గించాలన్నారు. చికిత్సకు సంబంధించిన నిర్ణయాల్లో రోగులు, వారి కుటుంబ సభ్యులను భాగస్వాములను చేయడం ద్వారా మెరుగైన వైద్య ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

**మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు**

పేషంట్ సేఫ్టీ డే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు.

**వడ్డెర కాలనీలో డ్రై డే అవగాహన**

వడ్డెర కాలనీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డ్రై డే ఫ్రైడే, డ్రై డే ట్యూస్‌డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.
అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించి ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సదానందం, శరత్, జిల్లా ఆరోగ్య విద్యావేత్త పంజాల ప్రతాప్ గౌడ్, సబ్‌యూనిట్ అధికారి రాజేందర్ రాజు, ఆరోగ్యశాఖ సిబ్బంది సాజిదా పర్వీన్, నరేందర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు**



**హుజురాబాద్, సెప్టెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు ):**వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో హుజురాబాద్ పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు పోలీసు, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.

**భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి**

నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. నిమజ్జన స్థలంలో భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సౌకర్యాలు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు.
నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన స్థల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు.

**సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం**

పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

**నిమజ్జన స్థలంలో అవసరమైన సౌకర్యాలపై పరిశీలన**

నిమజ్జన స్థలంలో చేపట్టాల్సిన వివిధ ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులు చర్చించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచడం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై దృష్టి సారించారు.
ఈ సందర్భంగా CP గౌస్ ఆలం, ACP మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, AE నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, జవాన్ రాజు తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
వినాయక నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయనున్నట్లు తెలిపారు.

# ప్రతిభకు దక్కిన గౌరవం.!


- **శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా పోతర్లంక జయరామ్.**
- **అక్షర కిరీటి అవార్డుకు ఎంపిక.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సాహితీ రంగంలో తనదైన ముద్ర వేస్తూ కవిగా, రచయితగా కొనసాగుతున్న సత్తుపల్లి పట్టణానికి చెందిన పోతర్లంక జయరామ్‌కు అరుదైన గౌరవం లభించింది. శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ కార్యదర్శిగా ఆయన నియమితులయ్యారు. సాహిత్య రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన శ్రీశ్రీ కళావేదిక ఈ బాధ్యతలను అప్పగించింది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, అధికార ప్రతినిధి వరలక్ష్మి సాయిరాం ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంతో పాటు జయరామ్‌ను 'అక్షర కిరీటి' అవార్డుకు ఎంపిక చేశారు.
భద్రాచలం ఎట్టపాకలోని పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 20న నిర్వహించనున్న 176వ శతాధిక కవి సమ్మేళనం సందర్భంగా అవార్డు ప్రదాన కార్యక్రమం జరగనుంది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ చేతుల మీదుగా జయరామ్ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ.. 176వ శతాధిక కవి సమ్మేళనం సందర్భంగా తనను అక్షర కిరీటి అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. కవులు, కళాకారులను ప్రోత్సహించడంలో శ్రీశ్రీ కళావేదిక ముందుంటుందని, దేశ, విదేశాల్లో వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. తన సాహితీ ప్రయాణాన్ని గుర్తించి ఈ గౌరవం అందించిన వేదికకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. జిల్లా కార్యదర్శిగా నియమితులవడంతో పాటు అక్షర కిరీటి అవార్డుకు ఎంపికైన పోతర్లంక జయరామ్‌కు సత్తుపల్లి డివిజన్‌కు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.



# ప్రజా సమస్యలపై కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

- **రైతాంగ సమస్యలు పరిష్కరించాలి.**
- **ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిబంధనలు పాటించాలి.**
- **11 వేల ఎకరాలకు సాగునీరు.. ఎత్తిపోతల పథకాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్.**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో నెలకొన్న ప్రజా, రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, సాగునీటి కాలువల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సదుపాయం, మైనారిటీలకు అవసరమైన స్థలం తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్ల ఎల్ 1, ఎల్ 2 కేటగిరీల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా జరగడం లేదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. అధికార పార్టీ క్యాంపు కార్యాలయాల్లో రూపొందించిన అనధికారిక జాబితాలను విచారణలకు పంపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల స్థానిక సర్పంచుల హక్కులు, స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. అనధికారిక జాబితాలను రద్దు చేసి.. సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలని కోరారు. తల్లాడ మండలం సిరిపురం మేజర్ కాలువ ఆధునికీకరణ పనులు పెండింగ్‌లో ఉండటంతో సుమారు 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. సీతారామ సాగర్ జలాలు సమీపంలో ప్రవహిస్తున్నా.. కాలువ పనులు పూర్తికాక నీటిని ఆయకట్టుకు మళ్లించలేకపోతున్నారని పేర్కొన్నారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.పెనుబల్లి మండలంలోని రాతోని, తాళ్లపెంట ఎత్తిపోతల పథకాల పరిధిలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లను ఏడాది గడిచినా పునరుద్ధరించలేదని నాయకులు తెలిపారు. రాతోని పథకం కింద 2,300 ఎకరాలు, ఐదు గ్రామాలు, తాళ్లపెంట పథకం కింద 1,600 ఎకరాలు, రెండు గ్రామాలు ఉన్నాయని వివరించారు. మొత్తంగా సుమారు 3,900 ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పంటలను కాపాడాలని కోరారు. రఘునాథపాలెం మండలం జింకలతండాలో ఈద్గా, ఖబరస్థాన్‌కు సరైన స్థలం లేక గ్రామస్థులు 55 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేటాయించిన ప్రభుత్వ భూమికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జిల్లాలోని ఇతర ప్రజా సమస్యలను సైతం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి.. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వల్భాపూర్ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 18 ( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలోని శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీవారం సందర్భంగా కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదోక్తంగా కుంకుమార్చన పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాబు స్వరూప, రాజ్‌కోటి సోనీ, రంజిత్ స్రవంతి, గణేష్ నిరోష, కుమారస్వామి గీత, గంగోత్రి, సురేందర్ మంజుల, రాజేందర్ ఐలమ్మతో పాటు యూత్ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీలుగులలో రాశి స్విఫ్ట్ పత్తి ప్రదర్శన



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం జీలుగుల గ్రామంలో సమ్మిరెడ్డి చేనులో రాశి సీడ్స్ ఆధ్వర్యంలో రాశి స్విఫ్ట్ పత్తి రకం ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు రాశి స్విఫ్ట్ పత్తి రకం ప్రత్యేకతలు, దిగుబడి, సాగు విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాశి సీడ్స్ ఆర్‌సీఎం ప్రమోద్, టీఎస్‌ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాశి స్విఫ్ట్ పత్తి రకం తక్కువ కాలంలోనే అధిక దిగుబడిని అందిస్తుందని తెలిపారు. పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగులను సమర్ధవంతంగా తట్టుకునే సామర్థ్యం ఈ రకానికి ఉందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు ఈ పత్తి రకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అలాగే పంట త్వరగా చేతికి రావడం వల్ల రైతులకు తదుపరి పంటల సాగుకు అవకాశం ఉంటుందని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులు ఆధునిక పత్తి వంగడాలపై అవగాహన పెంచుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పీఓలు పి. హరీష్, గడ్డి శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, చందుతో పాటు జీలుగుల, వల్లభాపూర్, కోతులనడుమ, జగన్నాథపూర్, మాణిక్యపురం, గోపాల్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు పాల్గొన్నారు.

# యూపీఐపై పన్ను భారం వద్దు




- **ఆన్‌లైన్ లావాదేవీలను ఉచితంగా కొనసాగించాలి.**
- **మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ.**

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** యూపీఐ లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న పన్ను విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్, ములకలపల్లి మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ చెల్లింపులపై అదనపు భారం మోపకుండా డిజిటల్ లావాదేవీలను మరింత సరళంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మాస్‌లైన్ ములకలపల్లి సంయుక్త మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ కీలకంగా మారిందన్నారు. చిన్న వ్యాపారులు మొదలుకొని సామాన్య ప్రజల వరకు రోజువారీ లావాదేవీలకు యూపీఐపై ఆధారపడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై పన్ను విధించడం వల్ల ఆ భారం చివరకు వినియోగదారులపైనే పడే అవకాశం ఉందన్నారు. వాణిజ్య సంస్థలపై పడే అదనపు వ్యయాన్ని వారు వినియోగదారుల నుంచి వసూలు చేసే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల దేశ ప్రజలపై రూ.30 వేల కోట్లకు పైగా అదనపు భారం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం.. మరోవైపు ప్రజాధనాన్ని, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు వివిధ రూపాల్లో అప్పగిస్తోందని ఆరోపించారు. డిజిటల్ చెల్లింపుల సంస్థలు తొలుత ఉచిత సేవలతో ప్రజలను ఆకర్షించి, విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన తర్వాత లావాదేవీలపై క్రమంగా ఛార్జీలు, పన్నుల భారాన్ని పెంచే అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో డిజిటల్ లావాదేవీలపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే యూపీఐ, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై విధించిన పన్నును ఎత్తివేసి, డిజిటల్ చెల్లింపులను ప్రజలకు ఉచితంగా, సులభంగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నకిరేకంటి నాగేశ్వరరావు, కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు నూపా సరోజిని, రైతు సంఘం మండల కార్యదర్శి ఎర్రగొర్ల రామారావు, కోర్సా ఆదిలక్ష్మి, మీడియం వసంత, వేలకం కన్నయ్య, సోడే అనురాధ, గుర్రం లక్ష్మి, రవిచంద్ పాల్గొన్నారు.

# వెల్టూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించే అంశంలో ముందువరుసలో ఉంచుతాం

- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**పెద్దమందడి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించేందుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వెల్టూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలన్న గ్రామ ప్రజల డిమాండ్‌ను బీజేపీ నాయకుడు రమేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.వెల్టూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రంలో కొత్త మండలాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం ఎప్పుడు జీవో జారీ చేసినా, అందులో వెల్టూర్ మండల కేంద్రం అంశాన్ని ముందువరుసలో ఉంచుతామని తెలిపారు. జీవో వచ్చిన సమయంలో వెల్టూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించే అంశం మొదటివరుసలో ఉండేలా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.వెల్టూర్ ప్రాంత ప్రజల అవసరాలు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రం ఏర్పాటు అంశానికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో వెల్టూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై ఎమ్మెల్యే ఇచ్చిన హామీ పట్ల గ్రామస్థులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# వెదురు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

- **వెదురు ఉత్పత్తులతో ఉపాధి అవకాశాల పెంపు**
- **కళాకారులకు శిక్షణ, ప్రోత్సాహంపై దృష్టి**
- **పచ్చదనం కోసం మొక్కల పెంపకానికి కలెక్టర్ పిలుపు**




**కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ వెదురు పెంపకం, పర్యావరణ పరిరక్షణ, వెదురు ఆధారిత ఉపాధి అవకాశాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ప్రకృతి పరిరక్షణలో వెదురు కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.వెదురు వేగంగా పెరిగే సహజ వనరుగా ఉండటంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ముఖ్యమైన పాత్ర వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. వెదురు పెంపకం ద్వారా పచ్చదనం పెరగడమే కాకుండా నేలకోతను నియంత్రించవచ్చని వివరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణం, ఫర్నిచర్ తయారీ, కాగితం పరిశ్రమ, హస్తకళలు, అలంకరణ వస్తువుల తయారీలో వెదురు విస్తృతంగా వినియోగిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక రూపకల్పన, సాంకేతికతను జోడించడం ద్వారా వెదురు ఉత్పత్తులకు మరింత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కళాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెనుకబడిన తరగతులకు చెందిన కళాకారులు, చేతివృత్తిదారులను వెదురు ఆధారిత ఉత్పత్తుల తయారీ వైపు ప్రోత్సహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఉత్పత్తుల తయారీ, నాణ్యత పెంపు, విక్రయాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు.

భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వెదురు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి సింధుజ, కళావతి, రమాదేవి, పిల్లి శీను, సోమయ్య, బొల్లం శ్రీనివాస్, ప్రవల్లిక, వివిధ శాఖల అధికారులు, కళాకారులు, చేతివృత్తిదారులు పాల్గొన్నారు. వెదురు ఆధారిత ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు వాటి వినియోగం, ఉపాధి అవకాశాలపై చర్చలు నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా వెదురు పరిరక్షణ, పెంపకంపై అవగాహన కల్పించారు.

# నల్లమలలో 4జీ సేవల విస్తరణకు చర్యలు

- **హేమంత్ కేశవ్ పాటిల్ సమీక్ష సమావేశం**
- **చెంచు గూడాలకు సమాచార సౌకర్యాల కల్పన**
- **బీఎస్ఎన్ఎల్ 4జీ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక**
- **అటవీ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం**




**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** నల్లమల అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో సమాచార సౌకర్యాలను మెరుగుపరిచేందుకు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల విస్తరణపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రజలకు మెరుగైన దూరసంప్రదింపుల సేవలు అందించడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ అనుసంధానాన్ని బలోపేతం చేయడంపై సమావేశంలో చర్చించారు. బీఎస్ఎన్ఎల్ అధికారులతో కలిసి ప్రస్తుత పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నల్లమల ప్రాంతంలోని చెంచు గూడాలు సహా దూర ప్రాంతాలకు మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు నెట్‌వర్క్ సౌకర్యాలు సరిగా అందని ప్రాంతాలను గుర్తించి అక్కడ 4జీ సేవలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనివల్ల స్థానిక ప్రజలకు సమాచార, విద్య, అత్యవసర సేవలు మరింత చేరువ కానున్నాయి.

గుర్తించిన ప్రాంతాల్లో 4జీ సంతృప్తీకరణ విధానంలో కొత్త కేంద్రాల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. అవసరమైన భూముల గుర్తింపు, అనుమతుల మంజూరు ప్రక్రియలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టేటప్పుడు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అటవీ సంపద, వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటి మధ్య సమతుల్యత ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

మారుమూల ప్రాంతాల్లో మెరుగైన సమాచార సౌకర్యాలు అందుబాటులోకి వస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సేవలు కూడా సులభంగా చేరుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు. విద్య, ఆరోగ్యం, అత్యవసర సేవల వినియోగం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, బీఎస్ఎన్ఎల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నల్లమల ప్రాంతంలో డిజిటల్ అనుసంధానాన్ని బలోపేతం చేసే చర్యలపై విస్తృతంగా చర్చించి అవసరమైన కార్యాచరణపై నిర్ణయాలు తీసుకున్నారు.

# ఎఫ్ఎల్ఎన్ అమలుతో విద్యా ప్రమాణాలు పెంచాలి





- **గద్వాలలో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష**
- **వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**
- **గైర్హాజరు ఉపాధ్యాయులపై కఠిన చర్యల హెచ్చరిక**
- **నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం**

**గద్వాల, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని 10వ బెటాలియన్‌లో నిర్వహించిన విద్యాశాఖ సమీక్ష సమావేశంలో ఆయన అధికారులతో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల్లో ఆశించిన స్థాయిని చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల నూరు శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు బోధన అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పురోగతిని క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

ఎఫ్ఎల్ఎన్ ట్రాకింగ్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. బేస్‌లైన్ నివేదికల ఆధారంగా విద్యార్థుల బలహీనతలను గుర్తించి ప్రత్యేక బోధనా వ్యూహాలు అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సృజనాత్మక బోధనా పద్ధతులు ఉపయోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి బుధవారం ప్రధానోపాధ్యాయులు సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. ప్యానెల్ తనిఖీ బృందాలు షెడ్యూల్ ప్రకారం పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ఎఫ్ఎల్ఎన్ అమలును పరిశీలించాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని తెలిపారు.

ఉపాధ్యాయులు విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ హెచ్చరించారు. హాజరు నమోదు చేసిన అనంతరం ఇతర పనుల నిమిత్తం పాఠశాలల నుంచి వెళ్లిపోతున్నారనే నివేదికలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలపై సమీక్ష నిర్వహించి సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఆధార్, అపార్, ఇతర విద్యా నమోదుల పురోగతిని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో శిక్షణ పొందుతున్న డిప్యూటీ కలెక్టర్లు రాజ్‌కుమార్, మనోజ్‌కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పాముకాటుపై అవగాహనే ప్రాణరక్షణ



- ప్రపంచ పాముకాటు అవగాహన దినోత్సవం ప్రత్యేకం
- గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు
- సకాలంలో చికిత్సతో మరణాలకు అడ్డుకట్ట
- ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధం

**డెస్క్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రపంచ పాముకాటు అవగాహన దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 19న నిర్వహిస్తారు. పాముకాటు వల్ల సంభవిస్తున్న మరణాలు, శాశ్వత వైకల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది లక్షలాది మంది పాముకాట్లకు గురవుతుండగా, వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలే ఎక్కువగా బాధితులుగా మారుతున్నారు. భారతదేశంలో పాముకాటు సమస్య చాలా కాలంగా ప్రజారోగ్య సవాలుగా కొనసాగుతోంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు రోజువారీ పనుల్లో భాగంగా పాముల ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. పొలాలు, గడ్డి దిబ్బలు, నీటి వనరుల సమీప ప్రాంతాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తాయి. దీంతో వర్షాకాలం, పంటల కాలంలో ప్రమాదాలు అధికంగా నమోదవుతుంటాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో పాముకాటు ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకుండా నడవడం, చెప్పులు లేకుండా బయటకు వెళ్లడం, పొదల్లో చేతులు పెట్టడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చాలామంది ప్రమాదం జరిగే వరకు జాగ్రత్తల ప్రాముఖ్యతను గుర్తించరు. అందుకే అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరం. పాముకాటు జరిగిన వెంటనే తీసుకునే చర్యలు బాధితుడి ప్రాణాలను కాపాడగలవు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. కొందరు మంత్రాలు, తంత్రాలు, స్థానిక వైద్యాలపై ఆధారపడుతూ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. శాస్త్రీయ ఆధారాలు లేని చికిత్సల వల్ల పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని మార్చేందుకు విస్తృత ప్రచారం అవసరం.

పాముకాటు జరిగినప్పుడు బాధితుడిని ప్రశాంతంగా ఉంచడం అత్యంత ముఖ్యం. భయాందోళనల కారణంగా విషం శరీరంలో వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుంది. బాధితుడిని అనవసరంగా నడిపించడం లేదా పరుగులు పెట్టించడం మంచిది కాదు. కాటు వేసిన అవయవాన్ని స్థిరంగా ఉంచి వెంటనే సమీప వైద్యశాలకు తరలించాలి. ఇదే సరైన ప్రథమ చికిత్సగా వైద్య నిపుణులు చెబుతున్నారు. కాటు వేసిన చోట కోయడం, బిగిగా కట్టడం, విషాన్ని నోటితో పీల్చడం వంటి పద్ధతులు ప్రమాదకరమైనవి. గతంలో ఇవి సాధారణంగా అనుసరించేవారు. కానీ ఆధునిక వైద్యశాస్త్రం ప్రకారం ఇవి ఎలాంటి ప్రయోజనం కలిగించవు. కొన్ని సందర్భాల్లో మరింత హాని కలిగించవచ్చు. అందువల్ల ప్రజలకు సరైన సమాచారం అందించడం కీలకంగా మారింది.

ప్రస్తుతం వైద్యరంగంలో పామువిషానికి సమర్థవంతమైన ప్రతివిష ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో ఆసుపత్రికి చేరితే ఎక్కువమంది బాధితులను రక్షించవచ్చు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం చాలా ముఖ్యం. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా వైద్యం అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పాములు ప్రకృతి సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయి. అవి ఎలుకలు వంటి పంటలకు హాని చేసే జీవుల సంఖ్యను నియంత్రిస్తాయి. అందువల్ల ప్రతి పామును శత్రువుగా చూడడం సరైంది కాదు. పాములను చంపడం కంటే వాటి నుంచి ఎలా రక్షించుకోవాలో తెలుసుకోవడం అవసరం. ప్రకృతితో సహజీవనం చేసే దృక్పథం పెంపొందాలి.

పాముకాట్ల వల్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. శాశ్వత వైకల్యాలు వచ్చినప్పుడు జీవనోపాధిపై ప్రభావం పడుతోంది. అందువల్ల ఈ సమస్యను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా సామాజిక సమస్యగా కూడా పరిగణించాలి. ప్రపంచ పాముకాటు అవగాహన దినోత్సవం ప్రజలకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. పాముకాటు విషయంలో భయం కాదు, అవగాహనే ప్రాణాలను కాపాడుతుంది. శాస్త్రీయ జ్ఞానం, సకాలంలో వైద్యం, ప్రజల అప్రమత్తత, ప్రభుత్వ చర్యలు కలిసివస్తే మరణాలను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో పాముకాటు నివారణపై సరైన అవగాహన పెరిగినప్పుడే ఈ దినోత్సవం లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరినట్టవుతుంది.

# తీరాల పరిశుభ్రతే పర్యావరణ రక్షణ



- కాలుష్య ముప్పుతో విలవిల్లాడుతున్న తీరాలు
- సముద్ర జీవాలకు పెరుగుతున్న ప్రమాదం
- ప్రజల భాగస్వామ్యంతోనే మార్పు సాధ్యం
- ప్రకృతి సంరక్షణకు సమిష్టి కృషి అవసరం

**డెస్క్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ తీరప్రాంతాల పరిశుభ్రత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తారు. సముద్ర తీరాలు, నదీతీరాలు, సరస్సుల పరిసరాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది స్వచ్ఛందంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రకృతి సంరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. కాలుష్యం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రపంచ దేశాలన్నీ ఎదుర్కొంటున్న ప్రధాన పర్యావరణ సమస్యల్లో సముద్ర కాలుష్యం ఒకటి. ప్రతిరోజూ లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు నదులు, కాలువల ద్వారా సముద్రాల్లోకి చేరుతున్నాయి. ఇవి తీర ప్రాంతాల్లో పేరుకుపోయి ప్రకృతి అందాలను దెబ్బతీయడమే కాకుండా సముద్ర జీవవ్యవస్థకు కూడా తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. మానవ నిర్లక్ష్యం కారణంగా ప్రకృతిపై పడుతున్న భారం రోజురోజుకు పెరుగుతోంది.

ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, వాడి పారేసే వస్తువులు, చేపల వలలు వంటి వ్యర్థాలు సముద్రాల్లో చేరి చేపలు, తాబేళ్లు, పక్షులు సహా అనేక జీవుల ప్రాణాలకు ప్రమాదంగా మారుతున్నాయి. ఆహారమని భావించి ప్లాస్టిక్‌ను మింగిన జీవులు మరణిస్తున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. పర్యావరణ సమతుల్యతకు కీలకమైన జీవజాతులు కాలుష్య ప్రభావంతో క్రమంగా తగ్గిపోతున్నాయి. ఇది భవిష్యత్ తరాలకు కూడా ప్రమాదకర సంకేతంగా మారుతోంది. సముద్ర కాలుష్యం కేవలం సముద్ర జీవాలకే పరిమితం కాదు. మానవ ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. సముద్రంలో చేరిన ప్లాస్టిక్ క్రమంగా సూక్ష్మ కణాలుగా మారి చేపల ద్వారా ఆహార గొలుసులోకి ప్రవేశిస్తోంది. చివరికి అవి మనుషుల శరీరాల్లోకి చేరి ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అందువల్ల తీరాల పరిశుభ్రత అనేది పర్యావరణ సమస్య మాత్రమే కాకుండా ప్రజారోగ్య అంశంగా కూడా మారింది.

భారతదేశానికి సుమారు 7,500 కిలోమీటర్లకు పైగా సముద్ర తీర ప్రాంతం ఉంది. ఈ తీరాలు జీవ వైవిధ్యానికి, మత్స్య సంపదకు, పర్యాటక రంగానికి ఎంతో కీలకమైనవి. అయితే పట్టణ వ్యర్థాలు, పారిశ్రామిక కాలుష్యం, నిర్లక్ష్యంగా పారేసే ప్లాస్టిక్ కారణంగా అనేక తీర ప్రాంతాలు కాలుష్యానికి గురవుతున్నాయి. పరిశుభ్రమైన తీరాలు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతాయనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు కలిసి ప్రతి సంవత్సరం తీర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వేలాది మంది విద్యార్థులు, యువకులు, పర్యావరణ ప్రేమికులు ఇందులో పాల్గొంటున్నారు. వ్యర్థాలను తొలగించడంతో పాటు కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడంలో సహాయపడుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి వ్యక్తి పాత్ర కీలకం. ఒక ప్లాస్టిక్ సంచిని నిర్లక్ష్యంగా పారేయడం చిన్న విషయంలా కనిపించినా అది చివరికి నదుల ద్వారా సముద్రంలో చేరి పెద్ద సమస్యగా మారుతుంది. అందువల్ల వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం వంటి చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలి. చిన్న చిన్న మార్పులే పెద్ద ఫలితాలకు దారితీస్తాయి. నదులు పరిశుభ్రంగా ఉంటేనే సముద్రాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయి. పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చే చెత్త నదుల్లోకి చేరకుండా చర్యలు తీసుకోవాలి. మురుగు నీటి శుద్ధి కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి. స్థానిక సంస్థలు వ్యర్థాల నిర్వహణపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సమగ్ర ప్రణాళికతో పనిచేస్తే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్యమవుతుంది.

ప్రపంచ తీరప్రాంతాల పరిశుభ్రత దినోత్సవం ప్రకృతి పట్ల మన బాధ్యతను గుర్తుచేస్తోంది. భూమి, నీరు, గాలి వంటి ప్రకృతి వనరులు మానవ జీవితానికి ఆధారం. వాటిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. పరిశుభ్రమైన తీరాలు పర్యాటకాభివృద్ధికి, జీవ వైవిధ్య పరిరక్షణకు, ఆరోగ్యకరమైన పర్యావరణానికి దోహదపడతాయి. ప్రకృతి మనకు అందించిన సంపదను భావితరాలకు అందించాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. తీర ప్రాంతాల పరిశుభ్రతను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ఉద్యమంగా మార్చాలి. ప్రజలు, ప్రభుత్వాలు, సంస్థలు సమిష్టిగా కృషి చేసినప్పుడే కాలుష్య రహిత తీరాలు సాధ్యమవుతాయి. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ద్వారా పరిశుభ్రమైన, సురక్షితమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చు.

# విశ్వ రహస్యాల అన్వేషణకు ఖగోళశాస్త్రం

- నక్షత్రాలపై ఆసక్తి పెంచే ప్రత్యేక దినం
- అంతరిక్ష పరిశోధనలకు ప్రేరణనిచ్చే సందర్భం
- యువతలో శాస్త్రీయ దృక్పథానికి వేదిక
- మానవ జిజ్ఞాసకు ప్రతీకగా ఖగోళశాస్త్రం





**డెస్క్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఖగోళ శాస్త్ర దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా అంతరిక్షం, గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలపై ప్రజల్లో ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించే ప్రత్యేక దినం. భూమికి అవతల ఉన్న విశ్వం గురించి తెలుసుకోవాలనే మానవ జిజ్ఞాసకు ఇది ప్రతీకగా నిలుస్తుంది. ఖగోళశాస్త్రం అనేది కేవలం శాస్త్రవేత్తలకే పరిమితమైన అంశం కాదు. సాధారణ ప్రజలు, విద్యార్థులు, యువతలో కూడా విశ్వం పట్ల అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. ఆకాశాన్ని పరిశీలించడం ద్వారా ప్రకృతి అద్భుతాలను అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. మనిషి వేల ఏళ్ల క్రితమే ఆకాశంలోని నక్షత్రాలను గమనించడం ప్రారంభించాడు. పగలు సూర్యుడు, రాత్రి చంద్రుడు, నక్షత్రాల కదలికలను పరిశీలిస్తూ కాల గమనాన్ని అంచనా వేసేవారు. వ్యవసాయం, నావిగేషన్, కాలమాన గణన వంటి అనేక రంగాల్లో ఖగోళ పరిశీలనలు కీలక పాత్ర పోషించాయి. కాలక్రమేణా ఈ పరిశీలనలు శాస్త్రీయ అధ్యయనాలుగా మారి ఖగోళశాస్త్రానికి పునాది వేశాయి.

గెలీలియో, కోపర్నికస్, కెప్లర్, ఐజాక్ న్యూటన్ వంటి శాస్త్రవేత్తలు ఖగోళశాస్త్ర అభివృద్ధికి విశేషకృషి చేశారు. భూమే విశ్వానికి కేంద్రం కాదని, సూర్యుడి చుట్టూ గ్రహాలు పరిభ్రమిస్తాయని నిరూపించిన పరిశోధనలు మానవ ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. టెలిస్కోప్ ఆవిష్కరణతో విశ్వాన్ని మరింత లోతుగా అధ్యయనం చేసే అవకాశం ఏర్పడింది. దీంతో ఖగోళశాస్త్రం వేగంగా అభివృద్ధి చెందింది. నేటి ఆధునిక యుగంలో అంతరిక్ష పరిశోధనలు మరింత విస్తరించాయి. శక్తివంతమైన దూరదర్శినులు, ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల ద్వారా కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలను అధ్యయనం చేస్తున్నారు. విశ్వం ఎలా ఏర్పడింది, జీవం భూమిపైనే ఉందా లేదా ఇతర గ్రహాలపై కూడా ఉందా వంటి ప్రశ్నలకు సమాధానాల కోసం పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రతి కొత్త ఆవిష్కరణ మానవ జ్ఞానాన్ని మరింత విస్తరిస్తోంది. భారతదేశం కూడా అంతరిక్ష రంగంలో విశేష పురోగతి సాధిస్తోంది. ఉపగ్రహ ప్రయోగాలు, చంద్రుడు, అంగారక గ్రహంపై నిర్వహించిన పరిశోధనలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. స్వదేశీ సాంకేతికతతో అనేక విజయాలను నమోదు చేస్తూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ విజయాలు దేశ యువతలో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంచుతున్నాయి.

ఖగోళశాస్త్రం కేవలం అంతరిక్ష అధ్యయనానికే పరిమితం కాదు. ఇది గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ విజ్ఞానం వంటి అనేక రంగాలతో ముడిపడి ఉంటుంది. విశ్వాన్ని అర్థం చేసుకునే క్రమంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి సమాచార ప్రసారం, వాతావరణ అంచనాలు, నావిగేషన్, విపత్తు నిర్వహణ వంటి రంగాలకు కూడా ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుత కాలంలో కృత్రిమ వెలుతురు కారణంగా నగరాల్లో రాత్రి ఆకాశం స్పష్టంగా కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని కాంతి కాలుష్యం అంటారు. కాంతి కాలుష్యం వల్ల ఖగోళ పరిశీలనలకు ఆటంకం కలుగుతోంది. నక్షత్రాల అందాలను ఆస్వాదించే అవకాశం కూడా తగ్గిపోతోంది. అందువల్ల ప్రకృతి సహజత్వాన్ని కాపాడే చర్యలు అవసరమవుతున్నాయి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో ఖగోళశాస్త్రం కీలక పాత్ర పోషిస్తుంది. ఆకాశ పరిశీలనలు వారిలో ప్రశ్నించే స్వభావాన్ని పెంచుతాయి. విశ్వం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి కొత్త ఆలోచనలకు, ఆవిష్కరణలకు దారితీస్తుంది. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లుగా ఎదగాలనుకునే యువతకు ఖగోళశాస్త్రం స్ఫూర్తిదాయకమైన రంగంగా నిలుస్తోంది.

ఖగోళ శాస్త్ర దినోత్సవం సందర్భంగా అనేక విద్యాసంస్థలు, శాస్త్ర కేంద్రాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. టెలిస్కోప్‌ల ద్వారా చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాలను చూపిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తాయి. శాస్త్ర ప్రదర్శనలు, ఉపన్యాసాలు, పరిశీలన శిబిరాలు నిర్వహించడం ద్వారా అంతరిక్షంపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ కార్యక్రమాలు శాస్త్రాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాయి. విశ్వం ఎంత విస్తారమైనదో, మానవ జ్ఞానం ఇంకా ఎంత తెలుసుకోవాల్సి ఉందో ఖగోళశాస్త్రం గుర్తు చేస్తుంది. ప్రతి నక్షత్రం, ప్రతి గ్రహం, ప్రతి గెలాక్సీ ఒక కొత్త రహస్యాన్ని దాచుకుని ఉంది. ఆ రహస్యాలను ఛేదించాలనే తపనే శాస్త్ర అభివృద్ధికి మూలం. ఖగోళ శాస్త్ర దినోత్సవం మనలో జిజ్ఞాసను పెంపొందిస్తూ విశ్వాన్ని అర్థం చేసుకునే ప్రయాణానికి ప్రేరణనిచ్చే ప్రత్యేక సందర్భంగా నిలుస్తోంది.

# బంగారం ధరలకు మళ్లీ రెక్కలు

**హైదరాబాద్, సెప్టెంబరు 18 (తెలంగాణ ముచ్చట్లు):** కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు శుక్రవారం ఒక్కసారిగా పెరిగాయి. ఉదయం 10.30 గంటల సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,500కుపైగా, 22 క్యారెట్ల ధరపై రూ.1,400కుపైగా పెరుగుదల నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల ధర కూడా రూ.1,100కుపైగా పెరిగింది.

గుడ్‌రిటర్న్స్ వివరాల ప్రకారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,5 8 0 పెరిగి రూ.1,54,570కు చేరింది. 22 క్యారెట్ల ధర రూ.1,450 పెరిగి రూ. 1,41,700గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.1,54,420, 22 క్యారెట్ల ధర రూ.1,41,550గా నమోదైంది.

తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,54,420, 22 క్యారెట్ల బంగారం రూ.1,41,550, 18 క్యారెట్ల బంగారం రూ.1,15,820గా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఇక ఢిల్లీ, ముంబైలో కిలో వెండి ధర రూ.5,000 పెరిగి రూ.2,50,000కు చేరింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేశ్
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై దృష్టి

- **అంబర్‌పేటలో పాఠశాలను సందర్శించిన కిషన్ రెడ్డి**
- **విద్యా బోధన, మౌలిక వసతులపై సమీక్ష**
- **విద్యార్థులతో ముచ్చటించిన కేంద్ర మంత్రి**
- **నాణ్యమైన విద్య అందించాలని సూచన**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అంబర్‌పేట పటేల్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ సీపీఎల్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను కూడా మంత్రి పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, పోషకాహార అంశాలపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిదో, పదో తరగతి విద్యార్థులతో కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి అభ్యాస అనుభవాలు, తరగతుల్లో బోధన విధానాలు, పాఠ్యాంశాల అవగాహనపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇవ్వడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. వారి ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, విద్యార్థులు పోటీ ప్రపంచానికి సిద్ధమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. ఆధునిక విద్యా విధానాలను వినియోగించి బోధనను మరింత ప్రభావవంతంగా చేయాలని అన్నారు.

పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి, తరగతి గదుల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి అంశాలను కూడా మంత్రి పరిశీలించారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సదుపాయాలపై అధికారులతో చర్చించారు. విద్యా రంగ అభివృద్ధి దేశ భవిష్యత్తుకు కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థులలో కనిపించిన ఆత్మవిశ్వాసం, నేర్చుకునే ఆసక్తి తనను ఆకట్టుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# వర్షాభావంపై కేంద్ర సహకారం కోరిన సీఎం



- **శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రేవంత్ భేటీ**
- **ఎల్‌నినో ప్రభావంపై వినతిపత్రం సమర్పణ**
- **ఇళ్ల కేటాయింపులు పెంచాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కలిసి రాష్ట్ర పరిస్థితులను వివరించారు. వర్షాభావం కారణంగా వ్యవసాయ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, రైతులకు మద్దతు అందించేందుకు కేంద్ర సహకారం అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర పరిస్థితులకు సంబంధించిన సమగ్ర వివరాలతో వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, తాగునీరు మరియు విద్యుత్ కొరత తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలను అప్రమత్తం చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించే చర్యలు చేపడుతున్నామని సీఎం పేర్కొన్నారు. పంటల మార్పిడికి రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని స్థిరీకరించేందుకు పలు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు వివరించారు.వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు మెరుగైన ధరలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద మొదటి విడతలో రాష్ట్రానికి రెండు లక్షల ఇళ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# ముజాహిద్ కుటుంబానికి కోటి రూపాయల భరోసా

- **ప్రమాద బీమా చెక్కు అందజేసిన భట్టి**
- **విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగికి నివాళి**
- **కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వం**
- **ప్రజాసేవకుల సంక్షేమానికి ప్రాధాన్యం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన కొత్తూరు 132 కేవీ సబ్‌స్టేషన్ జూనియర్ లైన్‌మ్యాన్ మహమ్మద్ ముజాహిద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ప్రమాద బీమా సాయాన్ని అందించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముజాహిద్ తల్లికి రూ.1 కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును అందజేసి ప్రభుత్వ తరఫున సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మహమ్మద్ ముజాహిద్ విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ప్రజాసేవలో నిమగ్నమైన ఉద్యోగుల సేవలను ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవిస్తుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రమాదంలో కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రమాద బీమా నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఉద్యోగి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సంక్షేమ పాలనలో భాగంగా ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ప్రజలకు సేవలందించే ఉద్యోగులు ప్రభుత్వ వ్యవస్థకు వెన్నెముకలని భట్టి విక్రమార్క అన్నారు. అలాంటి ఉద్యోగులు విధి నిర్వహణలో లేదా ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ముజాహిద్ కుటుంబానికి అందించిన ప్రమాద బీమా సాయం ఆ దిశగా తీసుకున్న చర్యల్లో భాగమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం పలు భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రమాద బీమా పథకాల ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంగా ప్రతి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవడమే తమ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాసేవలో ప్రాణాలు అర్పించిన ఉద్యోగుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ మరువదని, వారి కుటుంబాల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తూనే ఉంటుందని తెలిపారు. మహమ్మద్ ముజాహిద్ సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# హరీశ్ రావు భూములపై కాంగ్రెస్ బృందం పరిశీలన



- **సిద్దిపేటలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిశీలన**
- **అధికారులను వివరాలు అడిగిన ఎంపీలు, ఎమ్మెల్సీలు**

**సిద్దిపేట, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** సిద్దిపేట జిల్లాలో మాజీ మంత్రి హరీశ్ రావు, ఆయన బంధువుల పేర్లతో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూములను కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీల బృందం శుక్రవారం పరిశీలించింది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూముల అంశంపై ప్రస్తావించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ ప్రతినిధులు సంబంధిత అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో భూముల వివరాలను పరిశీలించారు. మొదట కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని సర్వే నంబర్ 271 పరిధిలో ఉన్న భూములను బృందం సందర్శించింది. మాజీ మంత్రి హరీశ్ రావు బంధువు హనుమంతరావు పేరుతో నమోదైనట్లు చెప్పబడుతున్న 6 ఎకరాల 2 గుంటల అసైన్డ్ భూములకు సంబంధించిన వివరాలను అధికారులు నుంచి తెలుసుకుంది. భూమి యాజమాన్యం, బదిలీల ప్రక్రియ, రికార్డుల నిర్వహణ అంశాలపై తహసీల్దార్‌ను ప్రశ్నించింది. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర రెవెన్యూ రికార్డులను బృందం పరిశీలించింది. గతంలో మాజీ సైనికులకు కేటాయించిన భూములు ఎలా ఇతరుల పేర్లకు బదిలీ అయ్యాయనే అంశంపై అధికారులు వివరణ ఇవ్వాలని కోరింది. సంబంధిత భూముల చరిత్రను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అసైన్డ్ భూములకు అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాల జారీ విషయంలో అనుసరించిన విధానాలపై కూడా కాంగ్రెస్ ప్రతినిధులు ప్రశ్నలు లేవనెత్తారు. జిల్లా కలెక్టర్‌కు మాత్రమే ఉన్న అధికారాలను ఇతర స్థాయి అధికారులు ఎలా వినియోగించారనే అంశంపై స్పష్టత కోరినట్లు తెలిపారు. ఈ విషయాలపై అధికారిక రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నాయకులు పలు ఆరోపణలు చేయగా, మరోవైపు హరీశ్ రావు లేదా ఆయన తరఫు నుంచి వచ్చిన స్పందన ఈ వివరాల్లో ప్రస్తావించబడలేదు. భూములకు సంబంధించిన అంశాలు అధికారిక విచారణలు, రికార్డుల పరిశీలనల ద్వారా స్పష్టతకు వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# జీవో 118 బాధితులకు శుభవార్త

- **రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంపై చర్చలు**
- **మంత్రులతో మధుయాష్కి గౌడ్ భేటీ**
- **హక్కు పత్రాల జారీకి చర్యలు**
- **ఎల్బీనగర్‌లో బాధితులతో ప్రత్యేక సభ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు)** జీవో 118 పరిధిలోకి వచ్చిన కాలనీల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం చూపే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని అసెంబ్లీలోని ఛాంబర్‌లో కలిసి జీవో 118 బాధితుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బాధిత కాలనీల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని తమ సమస్యలను నేరుగా మంత్రికి వివరించారు. రిజిస్ట్రేషన్ల సమస్య కారణంగా వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం అవసరమని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హైపవర్ కమిటీ సభ్యులు, సీసీఎల్ఏ లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కూడా ప్రత్యేకంగా చర్చలు జరిగాయి. గతంలో జీవో 118 కింద జారీ చేసిన పత్రాల కారణంగా ప్రజలు అనేక న్యాయపరమైన, పరిపాలనా సమస్యలను ఎదుర్కొంటున్నారని మధుయాష్కి గౌడ్ వివరించారు. ప్రజలకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేలా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను కోరారు. హుడా లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన అనేక మంది యజమానులు రిజిస్ట్రేషన్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో ప్రస్తావించారు. జీవో 118 ద్వారా జారీ చేసిన డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ వల్ల భవిష్యత్తులో కూడా న్యాయపరమైన చిక్కులు తలెత్తే అవకాశం ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల 22ఏ జాబితా నుంచి భూములను తొలగించి, ఎలాంటి వివాదాలకు తావులేకుండా కొత్త హక్కు పత్రాలు జారీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై స్పందించిన రెవెన్యూ శాఖ మంత్రి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసినట్లు వెల్లడైంది. బాధిత కాలనీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ల సమస్యకు ఆచరణాత్మక పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో కూడా ప్రతినిధులు సమావేశమై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీవో 118 వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కష్టపడి స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు అనవసరమైన పరిపాలనా సమస్యల్లో చిక్కుకున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రస్తుత ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు. దీంతో 44 బాధిత కాలనీల ప్రజలకు న్యాయం జరిగే అవకాశాలు మెరుగుపడ్డాయని అన్నారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి సంబంధించి శనివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మధుయాష్కి గౌడ్ ప్రకటించారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ సభలో బాధిత కాలనీల ప్రజలు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు హాజరై ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు వివరించడంతో పాటు కొత్త హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in